క్లుప్తంగా

13న రాజుపాళెంలో 'జగనన్నకు చెబుదాం'

రాజుపాళెం : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13న బుధవారం జిల్లా కలెక్టర్ విజయ రామరాజు రాజుపాళెం రానున్నట్లు ఈఓపీఆర్డీ షాకీర్ అలీఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మండల కేంద్రమైన రాజుపాళెంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కల్యాణ మండపాన్ని తహసీల్దార్ ఇందిరా రాణి, డిప్యూటీ తహసీల్దార్ వెంకట సాయి నాథ రెడ్డి, మండల ఆర్‌ఐ అశోక్, వీఆర్‌ఓలు పరిశీలించారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుల జీతాలు సకాలంలో అందించాలని, పీఆర్‌సీ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ (257) జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆ సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యంతర భృతి ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ సురేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా చంద్రమౌళి

గోపవరం : మండల అభివృద్ధి అధికారిగా చంద్రమౌళి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో బి.కోడూరు, ప్రస్తుతం పోరుమామిళ్ల ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన హరినారాయణ రెగ్యులర్ ఎంపీడీఓగా అన్నమయ్య జిల్లాకు పదోన్నతిపై వెళ్లారు.

స్పందనకు హాజరు కావాలి

గోపవరం : తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. స్పందన అనంతరం జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అన్నిశాఖల అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటల లోపు పూర్తిస్థాయి నివేదికలతో అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని గోపవరం రాజీవ్‌నగర్‌లో కేపీ పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ షేక్ అఫాన్ రోగులకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కేపీపీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కృష్ణవేణమ్మ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ వైద్య శిబిరం నిర్వహించి మందులు ఉచితంగా అందించామన్నారు. ఈ వైద్య శిబిరానికి శ్రీసాయి సప్తగిరి ఫార్మాస్యూటికల్స్, శ్రీసాయిచంద్ర మెడికల్ ఏజెన్సీస్, వినాయక ఏజెన్సీస్‌వారు సహకారాన్ని అందించారు.

చల్లంగ చూడు తల్లీ!

వీరపునాయునిపల్లె: మండలంలోని అనిమెల గ్రామ సమీపంలోని కోరకొండపై వెలసిన బోగాదమ్మ, తలపనూరు గ్రామ పొలాల్లో వెలసిన గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ మూర్తులను ఆలయ అర్చకులు రంగు రంగుల పుష్పాలు, ఆకులు, నిమ్మకాయలు, పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు ఎస్‌జీఎఫ్ఐ టోర్నమెంట్

కమలాపురం: స్థానిక గురుకుల పాఠశాలలో మంగళవారం ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ అరుణ కుమారి, మండల కన్వీనర్ ఎల్‌పి సునీల్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, అండర్-17 బాలబాలికలకు 9 అంశాలలో ఈ నెల 12వ తేదీ ఉదయం 9గంటలకు టోర్నమెంట్, సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలో పీఈటీలు, ఎస్‌ఏ పీఈలు మీ టీంతో సకాలంలో హాజరు కావాలని వారు తెలిపారు. అలాగే అకాడమిక్ మానిటరింగ్ యాప్‌లో క్రీడా కారుల పేర్లు తప్పక నమోదు చేయాలని సూచించారు.

అచ్చవెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్: పులివెందుల మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మ తల్లిగా అచ్చవెల్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధిగాంచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు కడప జిల్లా నుంచే కాక అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.

చంద్రబాబుకు శిక్ష తప్పదు

- సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ
- 30 ఏళ్లుగా వ్యవస్థలను మేనేజ్ చేసిన చంద్రబాబు


సచివాలయ ప్రారంభంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

పోరుమామిళ్ల : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు శిక్ష తప్పదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఆదివారం వారు పట్టణంలోని సచివాలయం-1 నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరం, అమరావతి అవినీతిలో రూ.118 కోట్లు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చిందన్నారు. ఫైబర్ నెట్‌వర్క్‌లో రూ.360 కోట్లు, అమరావతి భూములు, ఔటర్ రైన్ తదితర అనేక కేసుల్లో ఆయన అవినీతికి పాల్పడ్డారన్నారు. 30 సంవత్సరాలుగా చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ తప్పించుకుంటున్నారన్నారు. రెండు ఎకరాల పొలం నుంచి రెండు లక్షల కోట్లు ఎలా సంపాదించారని వారు ప్రశ్నించారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. ప్రజలకు పరిపాలన అందుబాటులో ఉండేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 14 రకాల సేవలతో సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చారని చెప్పారు. 1,40,000 మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని, పరోక్షంగా 2,50,000 మందిని వలంటీర్లుగా నియమించారన్నారు. ఇచ్చిన హామీలు 99 శాతం పూర్తి చేశారని, అవినీతికి తావు లేకుండా లబ్ధిదారుల అకౌంటులో నేరుగా డబ్బు జమ చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, యువ నేత డీసీ అదిత్యారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ-1 సీఎం బాషా, వైస్ ఎంపీపీ-2 చెన్ను రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, నృత్యకళల అకాడమి డైరెక్టర్ ఈశ్వరమ్మ, పార్టీ ప్రతినిధి సింగమాల వెంకటేశ్వర్లు, కోఆప్షన్ మెంబర్ అల్లా, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన పాలన కోసమే సచివాలయాలు

బి.కోడూరు : ప్రజలకు మెరుగైన పాలన అందించాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రామసముద్రం పంచాయతీలో నూతన సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందారన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయాల నిర్మాణంలో రాష్ట్రంలోనే బద్వేలు నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉండానికి కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులను అభినందించారు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆదిత్యరెడ్డి, పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, బి.కోడూరు సర్పంచ్ మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


నూతన ఆలయంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నాయకులు


ధ్వజప్రతిష్ట నిర్వహిస్తున్న భక్తులు

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లో నిర్మించిన నూతన దేవాలయంలో ఆదివారం శ్రీ వరసిద్ధి వినాయక, శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత రామస్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి వేదపండితులు శాస్త్రోక్తంగా, సాంప్రదాయ నిబద్ధతతో యంత్రప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి పూజాకార్యక్రమాలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. శిఖర, కలశ, ధ్వజస్తంభ, నాగుల ప్రతిష్ఠ కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వేలాదిమంది ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. ప్రతిష్ఠ అనంతరం సీతారాముల కల్యాణం జరిగింది. ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి, రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, యువనేత ఆదిత్యారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, నృత్యకళల డైరెక్టర్ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పార్టీ నాయకులు భారీగా పాల్గొన్నారు. రాత్రి పట్టణంలో ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలి


మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని ఫోర్టో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, జనరల్ సెక్రటరీ అంకాల్ కొండయ్య పేర్కొన్నారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఫోర్టో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ సరికాదని, తద్వారా ఉపాధ్యాయుల ఆశలు గల్లంతు అవుతాయన్నారు. అన్ని విభాగాల లాగే 70 శాతం ఫీడర్ కేటగిరి కింద ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, 30 శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, పీడీ అసోసియేషన్ నాయకులు శంకర్‌రెడ్డి, మాధవ రెడ్డి, ఫోర్టో నాయకులు పాల్గొన్నారు.

■ ఉపాధ్యాయ సేవా కేంద్రంలో భాషా పండిత వ్యవస్థను రద్దు చేసి వారికి వెట్టి చాకిరి నుంచి విముక్తి కలిగించడానికి కృషి చేసిన విద్వాన్ ఏపీ సిద్దయ్య సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. సిద్దయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అంకాల్ కొండయ్య, బోగా గంగాధర్, మధు, జింకా శేఖర్, రామసుబ్బారెడ్డి, దాదా బాషా, బాబా, సుధాకర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టంగుటూరు గౌసియా

ప్రొద్దుటూరు కల్చరల్ : దూదేకుల కులస్తుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టంగుటూరు గౌసియా పేర్కొన్నారు. స్థానిక మేదర వీధిలో ఆదివారం ఏపీ రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీకి ధన్యావాదాలు తెలిపారు. తమ కుల విద్యార్థుల టీసీలు మూడు రకాలుగా ఇవ్వడం వల్ల మైనారిటీలకు లభించే లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. తమకు ఇండియన్ ఇస్లాం దూదేకుల సర్టిఫికెట్లు మాత్రమే మంజూరు చేయాలని కోరారు. తమను కించే పరిచే విధంగా పిలుస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల్లో, క్యాబినెట్ ర్యాంకు స్థాయి పదవుల్లో తమకు ప్రాధాన్యత కల్పించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు కల్లూరు రఫీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు రసూల్‌బీ, నియోజకర్గ అధ్యక్షుడు దస్తగిరి, రెడ్డిబాబు, దస్తగిరి, కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభానికి హాజరు కావాలి

దువ్వూరు : మైదుకూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లక్షుమయ్య తెలిపారు. ఉదయం 9గంటలకు కడప రోడ్డులో స్టేట్ బ్యాంకు వెనకాల నిర్మించిన నూతన వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు హాజరు కావాలని కోరారు.

పోరాట యోధురాలు రజక ఐలమ్మ


ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : పెత్తందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు కొనసాగించిన యోధురాలు రజక ఐలమ్మ అని పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో రజక ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అట్టడగు వర్గాలైన చేనేత, కుమ్మరి, చాకలి లాంటి వృత్తిదారులను హీనంగా చూస్తున్న దొరలను ముప్పు తిప్పలు పెట్టిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. అలాగే పేదలకు భూములు దక్కేవరకు జమిందారులను, పట్వారీలను జనచైతన్యంతో తరిమి కొట్టిన ధీరవనిత ఐలమ్మ అన్నారు. ఇలాంటి వీరవనితను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ, అంబేడ్కర్ భవన కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు జకరయ్య, పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య, యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు రమేష్‌యాదవ్, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.వి.రమణ, దళిత నాయకులు కేశవయ్య, రవి, శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్యకాలనీలో ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి ముందడుగు వేసిన ధీరవనిత రజక ఐలమ్మ అని కొనియాడారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

కక్ష పూరిత చర్యతోనే చంద్రబాబు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : ఎఫ్ఐఆర్‌లో పేరు లేని చంద్రబాబునాయుడును అరెస్ట్ చేయడం కక్ష పూరితమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఆదివారం శివాలయం సెంటర్‌లో టీడీపీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఉద్దేశ పూర్వకంగానే తమ అధినాయకుడిని అరెస్ట్ చేశారని టీడీపీ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఏసీబీ కోర్టు చంద్రబాబునాయుడుకు రిమాండు విధించిన తర్వాత సాయంత్రం టీడీపీ శ్రేణులు కొవ్వొత్తులతో నిరసన తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, సీఎం సురేష్‌నాయుడు, అనం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కడప కల్చరల్ : శాకాహారం ద్వారా మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కడప పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ నిర్వాహకులు జీవీఎస్ రెడ్డి తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక దేవునికడపలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. స్పిర్చ్యువల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో ధ్యానులు పిరమిడ్ మాస్టర్లతోపాటు స్థానిక ప్రముఖులు, ధ్యానులు దేవునికడప చెరువుకట్ట వద్ద ర్యాలీని ప్రారంభించి స్థానిక వీధుల్లో అంశంపై ప్రచారం చేస్తూ కరపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు 'బాసట' వితరణ

కడప కల్చరల్ : బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఇద్దరు విద్యార్థుల చదువుకోసం ఆర్థికసాయం అందజేసింది. నగరానికి చెందిన అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వర్షితకు రూ.13 వేలను సంస్థ సభ్యులు డీఏ కార్తీక్‌రెడ్డి, శ్రీవాణి హైస్కూలు కరస్పాండెంట్ జి.మాధవిరెడ్డిల ద్వారా ఆ విద్యార్థినికి చెక్కు రూపంలో అందజేశారు. అలాగే స్థానిక ఆర్కే నగర్‌కు చెందిన మరో బీటెక్ విద్యార్థి రహమతుల్లాఖాన్‌కు చదువుకోసం రూ.7 వేలను అందజేశారు.

కృతజ్ఞత సభ వాయిదా

వీరపునాయునిపల్లె: గడప గడపకు మన ప్రభుత్వం విజయవంతంగా ముగిసిన సందర్భంగా నిర్వహించనున్న ఆత్మీయ కృతజ్ఞత సభ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని వీరపునాయునిపల్లె జేఏసీ చైర్మన్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మళ్లీ ఎప్పుడు నిర్వహించు తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన ధ్యేయమని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిడుజివ్వి గ్రామంలో ప్రజాదర్బార్‌లో భాగంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సంక్షేమ పథకాలు ఇంటి వద్దకు అందించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ప్రవేశ పెట్టారని దీని వల్ల ప్రతి పథకం ఇంటి ముంగింటకే చేరుతోందని చెప్పారు. ఆయా ప్రజా సమస్యలపై స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు


శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : నగరంలో ఆదివారం శ్రీకృష్ణాష్టమి ఐదు రోజుల వేడుకల ముగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. సంస్థ ఆధ్వర్యంలో అక్కాయపల్లెలోని అక్కదేవతల గుడి వద్ద 6వ తేదిన శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని కృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చి ఐదు రోజులపాటు పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం పూజలనంతరం స్వామిని ప్రత్యేకమైన పల్లకిపై కొలువుదీర్చి స్థానిక వీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహిళా భక్తులు, బాలలు సైతం పల్లకిని మోస్తూ శాస్త్రినగర్, బాలాజీనగర్, కాగితాలపెంట, నబీకోటల మీదుగా సాగారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కడప కమిటీ అధ్యక్షుడు బి.నవనీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేవుడే మనిషిగా అవతరించాడు గనుకనే కృష్ణుడిని భగవంతుడు అంటారన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు వద్దు బతికి సాధిద్దాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కడప డీఎస్పీ షరీఫ్, పీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన బాగా చదవండి, ఆత్మహత్యలు వద్దు బ్రతికి సాధిద్దాం అని పోస్టర్‌ను పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో కడప డీఎస్పీ షరీఫ్ ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో అనేకమంది విద్యార్థులు, యువత, రైతులు తొందరపాటు నిర్ణయంలో ఆత్మహత్యలు చేసుకుని తనువు చాలిస్తున్నారన్నారు. దీని కారణంగా వారి కుటుంబ సభ్యులు అనాథలు అవుతున్నారన్నారు. పీఎస్‌యూ ఆధ్వర్యంలో ఒనేక సదస్సులు నిర్వహించి విద్యార్థులను, యువతను చైతన్యం చేయడం అభినందనియం అన్నారు. అలాగే కాలేజ్ స్టూడెంట్స్ చెడు అలవాటులకు బానిసలుగా మారి బైకులతో వేగంగా ప్రయాణించి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.

సనాతన ధర్మాన్ని కించపరిస్తే ఊరుకోం

ప్రొద్దుటూరు కల్చరల్ : సనాతన ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునేది లేదని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జున పేర్కొన్నారు. స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కించపరిచే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రొద్దుటూరు ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి మాట్లాడుతూ ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలకు నిరసనగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలకు నిరసనగా ప్రతి ఒక్క కుల సంఘం, సామాజిక సంస్థలు పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కార్యదర్శి భాస్కర్‌రావు, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని ఎవరూ నాశనం చేయలేరు

పోరుమామిళ్ల : సనాతన ధర్మాన్ని ఎవరూ నాశనం చేయలేరని సమరసత జిల్లా ప్రముఖ్ బాలరంగయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ధర్మాన్ని నాశనం చేయాలని చూస్తే అది కాలసర్పమై కాటు వేస్తుందన్నారు.

జొన్న.. దిగుబడులు మిన్న


రాజుపాళెంలో ట్రాక్టర్‌తో జొన్న పంటను వేస్తున్న రైతులు


కూలూరులో ముందస్తుగా సాగు చేసిన జొన్న పంట

మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు ముమ్మరంగా జొన్న పంటను సాగు చేస్తున్నారు. గత పది రోజుల క్రితం పడిన వర్షంతో పొలాలన్నీ పదును య్యాయి. జొన్న పంటకు ఇదే అదును కావడంతో రైతులంతా ట్రాక్టర్లతో ఎరువులు, జొన్న విత్తనాలు రెండింటిని గొర్రు ద్వారా విత్తుతున్నారు. కూలూరు, పగిదాల, టంగుటూరు, రాజుపాళెం తదితర గ్రామాల్లో ముందస్తుగా జొన్న పంట వేయడంతో బాగా మొలిచింది. వరి పంటకు బదులుగా చాలామంది రైతులు ఈ పంట వైపే మొగ్గు చూపుతున్నారు. పెట్టుబడులు కూడా తక్కువగా అవుతాయని, దిగుబడులు అనుకున్న మేర రావాలని కోటి ఆశలతో పంటను సాగు చేస్తున్నామని రైతన్నలు చెబుతున్నారు.

– రాజుపాళెం

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు


డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా వరిసాగు చేస్తున్న దృశ్యం

అట్లూరు : డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా వరిసాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని బద్వేలు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు మండల పరిధిలోని పుట్టాయపల్లె రైతుభరోసా కేంద్రం పరిధిలో రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గురజాలపెంచలయ్య అనే రైతు డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగు చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా రైతులు వరిసాగు చేస్తే విత్తన ఖర్చు తక్కువ, నీటి పొదుపు చేయడంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.